www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 31 అక్టోబర్ 2025
5
పశ్చిమ గోదావరి



1న షటిల్ బాడ్మింటన్ ఎంపికలు

ప్రజాశక్తి - వీరవాసరం

నవంబర్ 1వ తేదీ నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ - 14, 17 బాలబాలికల జిల్లా షటిల్ బాడ్మింటన్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు డి.సునీత, పిఎస్ఎన్.మల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులు డివిజనల్ స్థాయిలో ఎంపికైన వారు మాత్రమే పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు నేరుగా జిల్లా ఎంపికలో పాల్గొనవచ్చని తెలిపారు. తణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో నిర్వహించే ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం తొమ్మిది గంటలకు రిపోర్టు చేయాలని తెలిపారు.

సిపిఎం సీనియర్ నేత
చింతకాయల బాబూరావు కన్నుమూత





బాబూరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంతెన సీతారాం

నివాళులర్పించిన ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, సిపిఎం, యుటిఎఫ్, ప్రజాసంఘాల రాష్ట్ర, జిల్లా నేతలు

కార్మికోద్యమానికి సుదీర్ఘకాలం నాయకత్వం వహించిన బాబూరావు

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో బాబూరావు భార్య శ్రీదేవి

భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పిన సిపిఎం సీనియర్ నేత మంతెన సీతారాం

ప్రజా ఉద్యమాలకు బాబూరావు మృతి తీరని లోటు

నేడు భౌతికకాయాన్ని ఆశ్రం మెడికల్ కాలేజీకి అప్పగింత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కార్మికోద్యమ నేత చింతకాయల బాబూరావు ఆకస్మికంగా గుండె పోటుతో గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. అనారోగ్యంగా ఉండడంతో రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా అక్కడ గుండెపోటు రావడంతో ఆకస్మికంగా మరణించారు. ఆయన మరణ వార్త జిల్లాలోని సిపిఎం, సిఐటియు శ్రేణులను, కార్మిక వర్గాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన భౌతికకాయాన్ని రాజమండ్రి నుంచి స్థానిక సిపిఎం కార్యాలయానికి తరలించారు. అక్కడ పార్టీ శ్రేణులు, కార్మికులు, రాష్ట్ర, జిల్లా నేతల సందర్శనార్థం ఉంచారు.

బాబూరావు 1962 జూన్ 4న తాడేపల్లిగూడెంలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టి ఇంటర్ వరకు చదువుకున్నారు. బిఎ, ఎంఎ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో పూర్తి చేశారు. భార్య శ్రీదేవి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో ఉన్నారు, ఆయనకు కుమారుడు సిద్ధార్థ ఉన్నారు. గణపవరం మండలంలో రైస్‌మిల్లు కార్మికుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అనేక సంఘాలను నిర్మించారు. సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా వచ్చి తాడేపల్లిగూడెంలో కార్మికోద్యమ నిర్మాణంలో ఎనలేని కృషి చేశారు. జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. తుదిశ్వాస విడిచే వరకు ఎర్రజెండా నీడలో ఉన్నారు. సిపిఎం తాడేపల్లి గూడెం తాలూకా తొలి కార్యదర్శిగా పనిచేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా, సిపిఎం ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, అప్‌ల్యాండ్, ఏలూరు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేశారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో సొంత జిల్లా పశ్చిమగోదావరి జిల్లా కు వచ్చారు. రైతు సంఘం జిల్లా నేతగా అనేక పోరాటాల్లో భాగస్వామ్యం అవుతూ ప్రస్తుతం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుని బాధ్యతల్లో ఉన్నారు.

సిపిఎం కార్యాలయంలో ఉన్న బాబురావు భౌతిక కాయానికి తొలుత సిపిఎం రాష్ట్ర సీనియర్ నేత మంతెన సీతారాం పార్టీ జెండా అరుణపతాకాన్ని కప్పి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమా మహేశ్వరరావు, బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.సుబ్బారావమ్మ, పి.అజయ్ కుమార్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు నరసింహారావు, ధనలక్ష్మి, యూటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి. గోపాలన్, బాబురావు భార్య శ్రీదేవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ, ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్, సిఐటియు ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, సిపిఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.తులసి, సిఐటియు ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శులు డి.ఎన్.వి.డి ప్రసాద్, కె.రాజరామోహన్ రాయ్, బి.పవన్, జిల్లా నాయకులు ఎ.అజయ కుమారి, ఎం.సుందర్ బాబు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.అరుణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రం, రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు నాగ శిరోమణి, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఐద్వా జిల్లా కార్యదర్శులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతి బాబు, పొగాకు పూర్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు దానం వరప్రసాద్, యుటిఎఫ్ జిల్లా నాయకులు భవానీ ప్రసాద్, వివిధ సంఘాల నేతలు కళింగ లక్ష్మణ్, మండల నాగేశ్వరరావు, డి.సోమసుందర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొర్రెలశ్రీధర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సుందరయ్య, ఎల్.ఐ.సి ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవి కిషోర్, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, డి.వై.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.ఎన్.శర్మ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి గేదెల శివకుమార్ తదితరులు పూలదండలతో బాబురావు భౌతికకాయానికి ఘన నివాళులర్పించారు.

నివాళులర్పించిన ఎంఎల్ఎ బొలిశెట్టి, ఎంఎల్‌సి గోపీమూర్తి

చింతకాయల బాబూరావు భౌతికకాయాన్ని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబూరావు భార్య శ్రీదేవిని ఓదార్చారు.


సంతాపం తెలిపిన ప్రముకులు..

చింతకాయల బాబురావు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర సీనియర్ నేత, మాజీ ఎంపీ పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిలో సురేంద్ర, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, విజయనగరం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి కృష్ణారావు, నంద్యాల జిల్లా కార్యదర్శి రమేష్, గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, కృష్ణా జిలా కార్యదర్శి వై.నరసింహారావు, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి గోవిందరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జయరాం తదితరులు సంతాపం తెలిపారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన పోరాటయోధుడు, కార్మికుల ఆశాజ్యోతి చింతకాయల బాబూరావు మరణం కార్మిక లోకానికి తీరనిలోటని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో గురువారం బాబూరావు భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆరు సంవత్సరాల క్రితం బాబూరావుకు గుండెకు బైపాస్ ఆపరేషన్ చేశారని, అప్పటి నుంచి కొంత అనారోగ్యంగా ఉన్నారని అన్నారు. ఈ రోజు రాజమండ్రి ఆసుపత్రిలో ఆయన గుండెపోటుతో మరణించారని తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. బాబూరావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని ఆయన అన్నారు.



బాబూరావు భౌతికకాయానికి నివాళులర్పించిన ఉమామహేశ్వరరావు



బాబూరావు భౌతికకాయానికి పూలమాల వేస్తున్న బలరాం



బాబూరావు భౌతికకాయానికి పూలమాల వేస్తున్న గోపాలన్



బాబూరావు భౌతికకాయం వద్ద జోహార్లు అర్పిస్తున్న గోపీమూర్తి



బాబూరావు భౌతికకాయానికి పూలమాల వేస్తున్న ఎంఎల్ఏ

జిల్లాల పునర్వ్యవస్థీకరణ సాగేనా

'ఒక నియోజకవర్గం అంతా ఒకే రెవెన్యూ డివిజన్‌లోకి' అంటూ రెవెన్యూ మంత్రి ప్రకటనతో రెండు జిల్లాల్లో కలకలం

ద్వారకాతిరుమల, గణపవరం మండలాల రూటెటు అంటూ సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

జిల్లాల పునర్వ్యవస్థీకరణ పునర్విభజన సందర్భంగా తలెత్తిన సమస్యలను పరిష్కరిస్తుందా, లేక కొత్త సమస్యలు తెస్తుందా అనే చర్చ రెండు జిల్లాల్లో పెద్దఎత్తున సాగుతోంది. ఒక నియోజకవర్గం అంతా ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనేది తమ అభిమతమని మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యలే కారణం.

జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఎన్టిఆర్, కృష్ణా జిల్లాల్లో కలపాలనేది అక్కడి ప్రజాప్రతినిధులు, ప్రజల ఆకాంక్షగా వివిధ రూపాల్లో ఇప్పటికే జిల్లా అధికారులకు, మంత్రివర్గ ఉపసంఘ సభ్యులకు సైతం వినతులిచ్చారు. అదే క్రమంలో పశ్చిమగోదావరి జిల్లాలో భాగంగా ఉన్న గణపవరం మండలాన్ని అక్కడే కొనసాగించాలని, ఏలూరు జిల్లాలో కలిపే ఆలోచన సరికాదని అక్కడి ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రం భీమవరం నుంచి నరసాపురానికి మార్చాలనే డిమాండ్ సైతం తెరపైకొచ్చింది.

ఇక పోలవరం జిల్లా ఏర్పాటుకు సంబంధించి గతంలో చంద్రబాబు హామీ ఇచ్చినా పెద్దగా చర్చ లేకపోవడంతో అక్కడి ప్రజలు సైతం రంపచోడవరం నియోజకవర్గం, పోలవరం నియోజకవర్గాలను కలిపి ఒక జిల్లాగా ఏర్పాటు చేయాలనేది అక్కడి ప్రజల డిమాండ్. ఈ డిమాండ్లపై ఇప్పటికే ఆయా ప్రాంతాల ప్రజలు తమ వినతులు అందించారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఎన్టిఆర్, కృష్ణా జిల్లాల్లో కలిపేందుకు ప్రభుత్వం కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న చింతలపూడి, లింగపాలెం మండలాలను జంగారెడ్డిగూడెం, లేదా పూర్వం తరహాలో ఏలూరు రెవెన్యూ డివిజన్‌లోగాని కలుపుతారనే చర్చ సాగుతోంది. ఈ క్రమంలో రెవెన్యూ మంత్రి ప్రకటన అనేక చర్చలకు వేదికైంది. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టిఆర్ జిల్లాలో కలిపితే కచ్చితంగా ఆ రెవెన్యూ డివిజన్ పరిధిలోని చింతలపూడి, లింగపాలెం మండలాలను జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్‌లోనే కలపాల్సి ఉంది. అదే జరిగితే జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ 12 మండలాలతో అతిపెద్ద డివిజన్‌గా రూపాంతరం చెందనుంది. ఏజెన్సీ ప్రాంతం కావడంతో అక్కడి అధికారులకు పరిపాలనా వ్యవహారాలు కష్టతరమయ్యే అవకాశం ఉంది. అదే సందర్భంలో ఇప్పటికే చింతలపూడి, లింగపాలెం మండలాల ప్రజలు సైతం తమను ఏలూరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలని కోరుతున్నారు.

ఇక తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న గోపాలపురం నియోజకవర్గంలో ఉన్న ద్వారకాతిరుమల మండలం ప్రసిద్ధ క్షేత్రం కావడంతో అప్పటి ప్రజాప్రతినిధులు, నేతల కోరిక మేరకు ఏలూరు జిల్లాలోనే ఉంచి, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్‌లో చేర్చారు. ఈ క్రమంలో నియోజకవర్గమంతా ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలంటే కచ్చితంగా ద్వారకాతిరుమలను ఏలూరు జిల్లా నుంచి వేరు చేయడం, లేదా గోపాలపురం నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలను ఏలూరు జిల్లాలో కలపడం గానీ చేయాలి. ఇది మరికొన్ని సమస్యలను తెరపైకి తీసుకొచ్చే పరిస్థితి కన్పిస్తోంది.

ఇక ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలం పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం రెవెన్యూ డివిజన్‌లో ఉంది. మిగిలిన ఉంగుటూరు నియోజకవర్గం అంతా ఏలూరు జిల్లాలోని ఏలూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంది. తొలుత గణపవరం మండలం కూడా ఏలూరు జిల్లా పరిధిలోనే ఉన్నా అక్కడి నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రజల కోరిక మేరకు తర్వాత పశ్చిమగోదావరి జిల్లాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి ప్రకటనతో గణపవరం మండలాలవాసుల ఆకాంక్షలకు భిన్నంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటు చేస్తే నిర్వాసితులంతా ఒకే జిల్లా పరిధిలోకి వస్తారు. తద్వారా నిర్వాసితుల సమస్యలపై పాలనా యంత్రాంగం దృష్టి పెట్టడానికి, పునరావాసంలో సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు తరాలకు ఇబ్బంది లేకుండా ఉంటుందనే వాదన విన్పిస్తోంది. మొత్తానికి కూటమి ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగి సమస్యలను పరిష్కరిస్తుందా, లేక కొత్త సమస్యలను తెరపైకి తీసుకొచ్చి ప్రజాందోళనకు కారణమవుతుందా అనేది వేచిచూడాలి.

తుపాను నష్టాన్ని అంచనా వేయాలి

ముంపు ప్రాంతాల ప్రజలకు సురక్షిత నీరందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదరవాడ నాగరాణి అన్నారు. తుపాను అనంతరం పరిస్థితులపై తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై గురువారం జిల్లా కలెక్టర్ నాగరాణి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహాశీల్దార్లు, ఎంపిడిఒలు, అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాను వల్ల జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తుగా పూర్తి సన్నద్ధతతో అహర్నిశలూ పనిచేసిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తుపాను ప్రభావిత గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు ఆదేశించారు. రోడ్లపై, ఇళ్లపై నేలకొరిగిన చెట్లను ఇంకా తొలగించకపోతే తక్షణమే తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సరుకులైన 25 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, బంగాళదుంపలు, నూనె, ఉల్లిపాయల కిట్లను తక్షణం పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అలాగే మత్స్యకార, చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కేజీల చొప్పున బియ్యాన్ని, నిత్యావసర వస్తువుల కిట్లను అందజేయాలన్నారు. జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారులు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఖతిబ్ కౌసర్ భానో, డిపిఒ, వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తహాశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

చినుకు పడితే కునుకు కరువు

పశ్చిమలో శిథిలావస్థలో ప్రభుత్వ వసతి గృహాలు

కోరుకొల్లు ఎస్‌సి బాలికల హాస్టల్ పరిస్థితి ఘోరం

విద్యార్థినులు నిద్రిస్తున్న చోట వర్షం కురుస్తున్నా పట్టించుకోని అధికారులు

బిక్కుబిక్కుమంటూ రాత్రి వేళల్లో జాగారమే

పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు

అమలుకు నోచుకోని టిడిపి కూటమి ప్రభుత్వ హామీలు

వాళ్లంతా రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం నుంచి వచ్చిన నిరుపేదల పిల్లలు. కూటి కోసం కోటి విద్యలు అంటారు. అటువంటి విద్య కోసం వారు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ప్రభుత్వ వసతి గృహాల్లో వసతి పొందుతూ విద్య అభ్యశిస్తున్న పేద విద్యార్థులకు కంటి నిండా కునుకు కరువైంది. వసతిగృహాలు శిథిలావస్థలో ఉండటంతో శ్లాబ్ లీకై చినుకు పడితే కునుకు కరువవుతున్న పరిస్థితి ఉది. ఈ నేపథ్యంలో రాత్రి అంతా జాగారం చేస్తూ విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు.



విద్యార్థులు పడుకునే చోట పడుతున్న వర్షం

ప్రజాశక్తి - భీమవరం

పేద విద్యార్థులు చదువుకునే వసతి గృహాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కనీస వసతులు లేక విద్యార్థులు నానావస్థలు పడుతున్నారు. హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరడం, డ్రెయినేజీ, మరుగుదొడ్లు అధ్వానంగా ఉండట, శ్లాబ్‌లు లీక్ కావడం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న కోరుకొల్లు ఎస్‌సి బాలికల వసతిగృహాన్ని ప్రజాశక్తి పరిశీలించింది. ఈ వసతి గృహం భవనాన్ని 2006లో అప్పటి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభోత్సవం చేశారు. భవన నిర్మాణం చేపట్టి సుమారు 19 ఏళ్లవుతోంది. అయితే భవనం నేడు శిథిలావస్థకు చేరుకుంది. భవనం శ్లాబ్ మొత్తం లీకవుతున్న పరిస్థితి ఉంది. 24 మంది విద్యార్థులు తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుకుంటున్నారు. అయితే వీళ్లంతా ఒకటే గదిలో పడుకుంటున్నారు. అయితే ఈ గదిలోని చదువుకోడానికి, నిద్రపోవడానికి, భోజనం చేయడానికి ఈ గదినే వినియోగిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. అయితే శ్లాబ్ పూర్తిగా పాడవ్వడంతో గదిలో వర్షం కురుస్తోంది. వర్షం వచ్చిన ప్రతిసారీ విద్యార్థులంతా జాగారం చేయాల్సిందే. విద్యార్థులు పడుకునే మంచాలపై వర్షం పడటంతో కంటిమీద కునుకులేకుండా రాత్రంతా నిరీక్షించాల్సిన దుస్థితి ఉంది. మంచాలు, దుప్పట్లు, పుస్తకాలు, ట్రంకు పెట్టెలు, సామగ్రి సైతం వర్షానికి తడిచిపోతూ కన్పించాయి. వసతి గృహంలో ఉన్న మరుగుదొడ్లలో రెండింటికి తలుపులు లేవు. వీటికి తలుపులు బిగించకుండా ఓ మూలన పెట్టారు. దీంతో విద్యార్థినులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పట్లేదు. స్థానికంగా ఉన్న డ్రెయినేజీని హాస్టల్ నిర్వాహకులే బాగు చేయించుకుంటున్న పరిస్థితి. అయితే ప్రస్తుతం మరుగుదొడ్ల పనులు రూ.80 వేలతో చేపట్టినట్లు హాస్టల్ అధికారి విజివి.లక్ష్మి తెలిపారు. భవనం శ్లాబ్ లీకేజీ మరమ్మతులకు ప్రతిపాదనలు చేశామన్నారు. అయితే జిల్లాలో అనేక వసతిగృహాల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. జిల్లావ్యాప్తంగా ప్రజాశక్తి పరిశీలనలో ఇది తేటతెల్లమైంది. భవనాలు శిథిలావస్థకు చేరడం, అద్దె భవనాల్లో కొనసాగడం, మౌలిక సౌకర్యాలు లేకపోవడం, శ్లాబ్ లీక్ కావడం, డ్రెయినేజీ, తాగునీరు వంటి సమస్యలు హాస్టల్ విద్యార్థులను వెంటాడుతున్నాయి.

అమలుకు నోచుకోని టిడిపి కూటమి హామీలు

ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రభుత్వ వసతి గృహాల రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చింది. దీనిలో ప్రధానంగా వసతి గృహాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అయితే టిడిపి కూటమి అధికారం చేపట్టి 16 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీల్లో ఏఒక్కటీ అమలు చేయలేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. జిల్లాలో బిసి సంక్షేమ శాఖ పరిధిలో 16 బోయ్స్, 13 గరల్స్ హాస్టళ్లు ఉన్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 15 బోయ్స్, 20 గరల్స్ హాస్టళ్లు ఉన్నాయి. తాడేపల్లిగూడెం రూరల్‌లో ఆరుగొలను, నరసాపురం రూరల్ ఎల్‌బిచర్లలో గురుకుల కళాశాలలు, పెనుగొండలో గురుకుల బాలికల పాఠశాల, తాడేపల్లిగూడెం రూరల్ తాడేపల్లిలో గురుకుల బాలుర పాఠశాల ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయా వసతి గృహాల్లో 5,329 మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. అయితే 32 వసతి గృహాలకు ప్రభుత్వ సొంత భవనాలు ఉండగా మరో 32 వసతి గృహాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. అయితే ఇటీవల రూ.కోటీ 29 లక్షలతో మరమ్మతుల పనులు చేపట్టారు. మరో రూ.కోటితో మరమ్మతు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులొస్తే తప్ప పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. అయితే ప్రభుత్వం వసతి గృహాలకు భవనాల నిర్మాణం పక్కనపెట్టి మరమ్మతులు చేసేదుకు మాత్రమే మొగ్గు చూపుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులు పడుతున్న అవస్థలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.



తలుపులు లేని మరుగుదొడ్లు ఇవే



పూడికపోయిన డ్రెయినేజీ

ప్రజాశక్తి పరిశీలన

పంట నష్ట పరిహారమివ్వాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - ఉండి

మొంథా తుపాను సృష్టించిన బీభత్సం వల్ల నష్టపోయిన పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేసి ప్రతి ఎకరాకూ నష్టపరిహారం రూ.20 వేలు అందించాలని సిపిఎం జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యండగండి సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో చిన్న, సన్నకారు రైతులు బ్యాంకు నుంచి బయట వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటకు పెట్టుబడులు పెట్టగా తుపాను వల్ల చేతికొచ్చిన పంట నష్టపోయిందని, ఈ నష్టాన్ని వెంటనే అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించాలని సూచించారు. ఈనిక దశలో ఉన్న పంట నీటిలో మునగడం పలువురు రైతులను దిగ్భ్రాంతికి గురి చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. నాయకులు కిలారి తవిటి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఆచంట: మొంథా తుపాన్ కారణంగా నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం బృందం ఆచంటలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించింది. రైతలను వివరాలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ మండలంలో సుమారు 600 ఎకరాల్లో పంట నేలనంటిందన్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేల వరకు రైతులు అప్పు చేసి పెట్టుబడులు పెట్టారని, తుపాన్ కారణంగా పాలుపోసుకునే దశలో పంట కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పంట నష్టపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న కౌలు రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తలుపూరి బుల్లబ్బాయి, నెక్కంటి కృష్ణమూర్తి, ఎస్‌విఎన్.శర్మ, బండి రంగారావు, కుసుమ జయరాజు, ఆచంట నాగేశ్వరరావు, ఊడి మోషే, పుచ్చకాయల చిన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉండి : సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

బాబూరావు మృతి తీరని లోటు

సిపిఎం ఆధ్వర్యాన నివాళులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడిన ప్రజా ఉద్యమ ధ్రువతార చింతకాయల బాబూరావు ఆకస్మిక మృతి సిపిఎంకి, కార్మిక లోకానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. బాబూరావు ఆకస్మిక మృతి పట్ల సిపిఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. సిఐటియు నాయకులు నేతల చిత్తరంజన్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు కె.సుబ్బారావు, కుల వివక్షత పోరాట సమితి కన్వీనర్ విజయ్ కుమార్, లక్ష్మీ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఆచంట : నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడిన ప్రజా ఉద్యమ ధ్రువతార చింతకాయల బాబూరావు ఆకస్మిక మృతి సిపిఎంకి, కార్మిక లోకానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. బాబూరావు ఆకస్మిక మృతి పట్ల సిపిఎం ఆధ్వర్యాన గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్‌వివి.శర్మ, తలుపూరి బుల్లబ్బాయి, కుసుమ జయరాజు, నెక్కంటి కృష్ణమూర్తి, మన్నే బ్రహ్మయ్య, సిఐటియు మండల కన్వీనర్, బండి రంగారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, కేత నాగాంజనేయులు, తానేలంక లక్ష్మీనారాయణ, సురేష్ చింతకాయల బాబూరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు.

వీరవాసరం : సిపిఎం నేత చింతకాయల బాబూరావు అకాల మరణం దిగ్భ్రాంతి కలిగించిందని గీత కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తుగ నరసింహమూర్తి అన్నారు. ఐదు దశాబ్దాలుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కలిసి పని చేశామని, ఉద్యమ నిర్మాణంలో బాబూరావు అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారన్నారు. ఆయన మృతి ఉద్యమానికి, వారి కుటుంబానికి తీరని లోటు అని, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

పాలకొల్లు : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు ఆకస్మిక మృతిపట్ల సిపిఎం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈమేరకు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, చల్లా సోమేశ్వరరావు, టి.శ్రీనివాస్, యర్రా ఆజయలు కార్మిక నేతగా ఆయన చేసిన సేవలు అమోఘమని సంతాపం వ్యక్తం చేశారు.

ఆకివీడు : కార్మికోద్యమ నేత, సిపిఎం జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు మృతి తీరనిలోటని సిపిఎం ఆకివీడు ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు అన్నారు. బాబూరావు అకాల మరణానికి చింతిస్తూ ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం ఏరియా కమిటీ సభ్యులు బివి.వర్మ, డి.రవితేజ, బి.రాంబాబు, బి.కళ్యాణి, ఎస్.సూరిబాబు, దొంగ సత్యనారాయణ, జివి.లావణ్య పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు పాలకొల్లు విద్యార్థిని ఎంపిక



పాలకొల్లు : పాలకొల్లులోని ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెకండ్ బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని కె.విజయలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ వాలంటీర్‌గా ప్రీ-రిపబ్లిక్ డే క్యాంప్ కోసం ఢిల్లీకి ఎంపికైంది. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లలో ప్రతిభ కనబరచి కె.విజయలక్ష్మి ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు గుజరాత్‌లో నిర్వహించే 10 రోజుల శిక్షణ శిబిరంలో పాల్గొనబోతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజారత్నం తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మిని ప్రశంసించారు.



పిఎం లంక సముద్రం

ప్రశాంతంగా పిఎం లంక సముద్రం

నరసాపురం : మొంథా తుపాను సముద్ర తీర ప్రాంతమైన మండలంలోని తూర్పుతాళ్ళు, చినమైనవాని లంక, పెదమైనవాని లంక, బియ్యపుతిప్ప గ్రామాల్లో తీవ్ర ప్రభావం చూపింది. ఆయా గ్రామాల్లో సముద్రం రాకాసి అలలతో ముందుకు రావడంతో పాటు తీర ప్రాంతం కోతకు గురైంది. గురువారం సముద్రం శాంతించి అలలు వేగం తగ్గింది. తుపాన్ ప్రభావంతో మూడు రోజులు హడావుడిగా ఉన్న గ్రామాలు ప్రశాంతంగా ఉన్నాయి.

ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి

పాలకొల్లు : పాలకొల్లులోని జిబిఎస్‌విఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ భారత స్వతంత్ర సంగ్రామంలో చురుకుగా పాల్గొని భారతీయుల హృదయాల్లో ఒక ఆదర్శమూర్తిగా నిలిచారన్నారు. మహా మేధావిగా, సహనశీలిగా, శాంతికాముకుడుగా, ఎంతటి విపత్తు వచ్చినా కొంచెం కూడా ఆత్మవిశ్వాసంతో, మనోధైర్యంతో ముందుకు సాగి ఆ సమస్యను ఎదుర్కొనే మహా మేధావి అన్నారు. అంతటి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, టి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డ్ మున్సిపల్ ఉద్యోగి జోజిబాబు మృతి

నరసాపురం : స్థానిక పీతలవారి పేటలో మున్సిపల్ శానిటేషన్ మేస్త్రిగా పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన ఈదా జోజిబాబు బుధవారం సాయంత్రం తన స్వగృహంలో మరణించారు. సిఐటియు నాయకత్వం గురువారం ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఈద జోజిబాబు మున్సిపల్ ఉద్యోగుల సంఘం సిఐటియు అనుబంధంగా ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన అనేక ఉద్యమాలు, పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. తన ఉద్యోగం చేయకుండా కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పోరాడిన వ్యక్తి జోజిబాబు అని కొనియాడారు. ఆయన మృతి సిఐటియు కార్మిక సంఘానికి తీరని లోటు అన్నారు. జోజిబాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నోముల కొండ, పొగాకు నారాయణరావు, కవురు సురేష్‌బాబు, మందిలి నీలకంఠం పాల్గొన్నారు.

ఇంటర్ నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా పరిపాటి

భీమవరం టౌన్ : ఇంటర్ నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్‌గా భీమవరానికి చెందిన ఆర్యవైశ్య నాయకులు పరిపాటి శ్రీనివాస్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోనా శ్రీనివాసరావు, గోంట్ల రామ్మోహనరావులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ ఐక్యత, గుర్తింపు, హక్కుల పరిరక్షణ కోసం కట్టుబడి పనిచేస్తానని, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల మార్గదర్శకత్వంలో సమాజానికి ఉపయోగపడే నిర్ణయాలు, కార్యక్రమాలకు పని చేస్తానన్నారు. ఈ నియామకంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్య సమాజంలో రాజకీయ అవగాహన, ప్రాతినిధ్యం, సంఘ బలం మరింతగా పెంచడానికి కృషిచేస్తానన్నారు. ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ గాను, వాసవి జుత్తిగ విజెఎఫ్ అధ్యక్షులుగాను, భీమవరం రూరల్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా, హ్యూమన్స్ రైట్స్ ఇంటర్నేషనల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

నరసాపురం : మండలంలోని లిఖితపూడి గ్రామంలో చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన విజలాపురపు పెద్దిట్ సుబ్బారావు(75) బుధవారం మోహం కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్, ఫైర్ సిబ్బంది తీవ్రంగా గాలించగా సాయంత్రం చెరువులో సుబ్బారావు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై నరసాపురం రూరల్ ఎస్‌ఐ బి.వెంకట సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మొగల్తూరులో వన సమారాధన

మొగల్తూరు : మొగల్తూరులోని వాడపాడ్ పేటలో ఉన్న వన మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో బ్రహ్మకుమారి ఈశ్వరీ విశ్వవిద్యాలయం నర్సాపురం, మొగల్తూరు శాఖల ఆధ్వర్యాన గురువారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వన సమారాధన చేశారు. నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సత్తినేటిబల్లి చిన్న నిర్మల, భారతి ఉన్నారు. కోట రోడ్ లో ఉన్న దత్తసాయి మందిరంలో దత్త సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మొంథా తుపాన్ మిగిల్చిన నష్టం

ఆక్వా చెరువుల నష్టం రూ.20 కోట్ల 50 లక్షలు
రోడ్లకు రూ.3 కోట్ల 486 లక్షలు,
విద్యుత్తుకు రూ.84,18 లక్షలు, ఇళ్లకు రూ.40 లక్షలు నష్టం ప్రాథమిక అంచనాలు
తేల్చిన అధికార యంత్రాంగం
జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మొంథా తుపాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని అధికార యంత్రాంగం నష్ట ప్రాథమిక అంచనాలు రూపొందించారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగారాణి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ప్రాథమిక నష్టం అంచనాలను, చేపట్టిన ముందస్తు చర్యలను కలెక్టర్ గురువారం వివరించారు. జిల్లాలోని 20 మండలాలపై ప్రభావం చూపిందని, దీనిలో 91 గ్రామాలు తుపాను తాకిడికి గురయ్యాయని, 13 గ్రామాలు, 6 పట్టణాలు పెద్ద ఎత్తున నీటి ముంపు గురయ్యాయని తెలిపారు. దీని కారణంగా 23,307 మందిపై ప్రభావం పడిందన్నారు. 13,431.83 హెక్టార్లలో వ్యవసాయం, 299.87 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. 93 ఇళ్లు దెబ్బతిన్నాయని, వీటిలో ఒక పక్క గృహం, 8 కచ్చా గృహాలు మొత్తం 9 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, 66 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, వీటిలో 44 పక్క గృహాలు, 52 కచ్చా గృహాలు ఉన్నాయన్నారు. ఇవికాక 18 గుడిసెలు దెబ్బతినడం జరిగిందని, నష్టం అంచనా విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని తెలిపారు. ఒక ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని వినియోగించడం జరిగిందన్నారు. 91 పునరావాస కేంద్రాలను నిర్వహించి 23,307 మందికి ఆశ్రయం కల్పించడం జరిగిందన్నారు. 15,600 ఆహార పొట్లాలను, 40,500 వాటర్ ప్యాకెట్లను తుపాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు. ఒక బోటు పాక్షికంగా దెబ్బతిందని, రెండు బోట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, 2 వేల మందికి సంబంధించిన 1,855 ఎకరాల విస్తీర్ణంలోని ఆక్వా చెరువులు నీట మునిగినట్లు తెలిపారు. వీటి నష్టం విలువ సుమారు రూ.2,026.50 లక్షలు గా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 58 రహదారులు 278 కిలోమీటర్ల మేర ఉపరితలం దెబ్బతిన్నాయని, ఒక ఆర్అండ్‌బి రహదారికి గండి పడిందని, జిల్లా మొత్తం 688 చెట్లు నేలకూలాగా, ఆర్అండ్‌బి పరిధిలో 52 చెట్లు నేలకూలినట్లు తెలిపారు. ఆరు రహదారులపై నుండి నీరు పొంగి పొర్లిందని, మూడు రహదారుల్లో ట్రాఫిక్ అంతరాయం కలిగినట్లు తెలిపారు. మొత్తం నష్టం అంచనా విలువ రూ.3,486 లక్షలుగా ఉందన్నారు. 22 ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో చెత్త డంపులను తొలగించడం జరిగిందని, ఐదు ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా వరద నీరు పారడం జరిగిందని తెలిపారు. వైద్యశాఖ ద్వారా 50 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే విద్యుత్ శాఖ నష్టాలను వివరిస్తూ 33 కెవి ఫీడర్స్ 55, 11 కెవి ఫీడర్స్ 415, 33/11 కెవి సబ్ స్టేషన్లు 96, 11 కెవి పోల్స్ 143, ఎల్టి పోల్స్ 39, 11 కెవి కండక్టర్స్ 3 కిలోమీటర్స్, డిటిఆర్స్ 3, వీటి నష్టం అంచనా విలువ సుమారు రూ.84.18 లక్షలుగా ఉందని కలెక్టర్ తెలిపారు.

వరిచేల పరిశీలన

పంట నష్టంపై అంచనా



గణపవరంలో పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎలు

ప్రజాశక్తి - గణపవరం

మొంథా తుపాన్ వల్ల మండలంలో దెబ్బతిన్న వరిచేలను గురువారం ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సిహెచ్.నాగరాణి పరిశీలించారు. మండలంలో చిలకంపాడు, కాశీపాడు, ఎ.గోపవరం, వీరేశ్వరపురం గ్రామాల్లో వరిచేలను పరిశీలించి పంటనష్టం వివరాలు అంచనా వేసి రైతులకు పరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నరసాపురం : మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటామని విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని సరిపల్లి, వైఎస్.పాలెం, లక్ష్మణేశ్వరం, ఎల్‌బి.చర్ల గ్రామాలలో పర్యటించారు. తుపాను కారణంగా వరి పంటలు, వ్యవసాయ భూములు, గృహాలకు జరిగిన నష్టాన్ని నాయకర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక రైతులు, ప్రజలతో మాట్లాడి తుపాను వల్ల ఎదురైన ఇబ్బందులను తెలుసుకున్నారు. రైతుల కష్టసుఖాలను అర్థం చేసుకున్న ఎంఎల్ఎ నాయకర్ ప్రభుత్వం తరఫున తక్షణ సాయం అందేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయాభివృద్ధి అధికారులతో కలిసి పంట నష్టాల వివరాలను సేకరించి నివేదికలను సమర్పించాలని సూచించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు ఆకన చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, జిల్లా డెల్టా వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు, ఎఎంసి వైస్ ఛైర్మన్ దేశనీడి గంగాధర్, నిప్పులేటి తారక రామారావు, బందెల రవీంద్ర, కటకంశెట్టి సంజీవ్ రావు, వెన్న నరేష్, కంచెర్ల ఫణికర్ పాల్గొన్నారు.



నరసాపురంలో..

మొగల్తూరు : నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని నౌడూరివారిగరువు, రాజుగారి కోట ప్రాంతాలలో గురువారం ఆయన పర్యటించారు. తుపాను కారణంగా వరి పంటలు, వ్యవసాయ భూములు, గృహాలకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు. స్థానిక రైతులు, ప్రజలతో మాట్లాడి తుపాను వల్ల ఎదురైన ఇబ్బందులను తెలుసుకున్నారు. రైతు, వ్యవసాయాధికారులతో కలిసి పంట నష్టాల వివరాలను సేకరించి నివేదికలను సమర్పించాలని సూచించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తగిన నష్టపరిహారం అందేలా కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, పశ్చిమ డెల్టా వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు, సొసైటీ ఛైర్‌పర్సన్ నిప్పులేటి తారక రామారావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పెనుమంట్ర : అంచనా వేస్తున్న జెడ్ వెంకటేశ్వరరావు

పెనుమంట్ర : మండలానికి చెందిన భట్లమగుటూరు, ఆలమూరు గ్రామాలలో తుపాను పంట నష్టం పరిశీలన నిమిత్తం క్షేత్రస్థాయిలో గురువారం అధికారులు పర్యటించారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్. వెంకటేశ్వర రావు, మార్టేరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంవి.రమేష్, స్థానిక వ్యవసాయాధికారి బి.దేవీ స్వరూప, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పంట నష్టపరిహారం అంచనాల గురించి క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయ సహాయకులు సూచనలు, సలహాలు ఇచ్చారు.

వరిలో జాగ్రత్తలపై సూచనలు

మార్టేరు ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

వరిపంటలో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి మార్టేరు ప్రాంతీయ వరి పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ వివరించారు. మండలంలో 4.15 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సార్వా పంటగా సాగవుతుందని, గోదావరి డెల్టాలో సాగుచేస్తున్న వరి పంట ఎక్కువగా పూత, పాలు పోసుకునే దశ నుండి కోత దశ వరకు ఉందన్నారు. అధిక వర్షాలకు పాలుపోసుకునే దశలో ఉన్న స్వర్ణ, సంపద స్వర్ణ రకాలు చేనుపై పడి నీట మునిగే అవకాశం ఉందని, వీటితో పాటూ మండలంలో ఎక్కువగా సాగులో ఉన్న ఎంటియు 1318, పిఎల్ఎ 1100 రకాలు పూత దశలో ఉన్నప్పుడు వర్షం కురిస్తే సంపర్కం సరిగ్గా జరగక తాలు గింజలు ఏర్పడతాయని, అదేవిధంగా ఎంటియు 1318 వంటి రకాలలో గొలుసుకట్టు దగ్గరగా ఉండటం వల్ల గింజలు రంగుమారడం, మానిపండు తెగులు వచ్చే అవకాశం ఉందని, నిరంతర వర్షాల వల్ల గింజలలో నిద్రావస్థ తొలిగి మొలక వచ్చే అవకాశం ఉందన్నారు. బాక్టీరియా, ఎండాకు తెగులు, మాగుడు తెగులు వ్యాపించే ప్రమాదం ఉందని, నిద్రావస్థ లేని బిపిటి 5204, పిఎల్ఎ 1100 రకాలలో గింజలు వెంటనే మొలకెత్తే అవకాశం ఉందని తెలిపారు. సందేహాల నివృత్తికి రైతాంగం వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజారాణిని 9490195904 నంబర్‌లో వాట్స్‌ఆప్ ద్వారా సంప్రదించగలరని ఆయన పేర్కొన్నారు.



కాళ్ల : వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పాలకొల్లు రూరల్ : తుపాను కారణంగా వాతావరణం మార్పుల నేపథ్యంలో వరి పంటలో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి గురువారం పాలకొల్లు మండలం లంకలకోడేరు, వెదుల్లపాలెం, వెంకటాపురం గ్రామాలలో పంట నష్టాన్ని పరిశీలించి ఆచార్య ఎన్‌జి.రంగా విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు పాలడుగు సత్యనారాయణ రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ టి.శ్రీనివాస్, డాక్టర్ మల్లిఖార్జున రావు, డాక్టర్ గిరిజారాణి, డాక్టర్ దయాళ్, ఎడిఎ పి.మురళీకృష్ణ, ఎఒ రాజశేఖర్, రైతులు నెక్కంటి అదినారాయణ పాల్గొన్నారు.

కాళ్ల : మండలంలోని కోపల్లె, వేంపాడు, జక్కరం గ్రామాలలోని వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. ఉండి కెవికె శాస్త్రవేత్తలు పి.వినయలక్ష్మి, వై.సునీత, వి.రోజా, ఎ.ఆనంద్ కుమార్ నెలకొరిగిన వరిచేలను పరిశీలించారు. వరి దుబ్బులను పరిశీలించి సాగులో తీసుకోవాల్సిన మెలకువలను రైతులకు తెలిపారు. కార్యక్రమంలో కాళ్ల ఎఒ రమేష్‌నాయుడు, రైతులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో నష్టాన్ని నివారించగలిగాం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం : తుపాను ప్రభావాన్ని జిల్లా యంత్రాంగం ముందస్తు సన్నద్ధ, సమిష్టి కృషితో జిల్లాలో తీవ్ర నష్టాన్ని నివారించగలిగామని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. భీమవరం పట్టణంలోని దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తుపాన్ బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, ఎఎస్‌ఒ రవిశంకర్ పాల్గొన్నారు.

గీత కార్మికుల హక్కులను కాపాడాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తుగ నరసింహమూర్తి

తణుకు : గీత కార్మికుల వృత్తి రక్షణ బాటను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తుగ నరసింహమూర్తి పిలుపునిచ్చారు. గురువారం సంఘం ఆధ్వర్యాన స్థానిక అమరవీరుల భవనంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తుగ నరసింహమూర్తి మాట్లాడుతూ... అక్టోబర్ 23 నుంచి నవంబర్ 18 వరకు వివిధ రూపాల్లో ఉద్యమాలు నిర్వహించాలన్నారు. గీత కార్మికులు అనేక ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కులను టిడిపి కూటమి ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. చెట్టు పనులు రద్దు చేశారని, మార్కింగ్ విధానాన్ని రద్దు చేశారని, కిస్తీల విధానాన్ని రద్దు చేశారని, గీత కార్మికులకు పూర్తిగా సొసైటీలపై ఎటువంటి హక్కులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వ విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్తులో గీత కార్మికులు కిస్తీలు ప్రభుత్వం కట్టించుకునేలా మార్కింగ్ విధానం అమలు చేయాలని, 45 సంవత్సరాలకు పెన్షన్ అమలు చేయాలని, ప్రభుత్వం నుండి వడ్డీ లేని సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని పలు అంశాలపై ఉద్యమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి, సహాయ కార్యదర్శి కడలి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కడలి బాలాజీ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

తణుకు : టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజవర్గంలో అభివృద్ధి, సంక్షేమం వేగంగా జరుగుతోందని తణుకు, అత్తిలి ఎఎంసి ఛైర్మన్ కొండేటి శివ, దాసం ప్రసాద్ పేర్కొన్నారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో ఎంతోమంది ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం పొందాలని దరఖాస్తులు చేసుకున్నప్పటికీ అప్పటి నేతలు వాటిని బుట్ట దాఖలు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నియోజకవర్గంలో 68 మందికి రూ.29.61 లక్షలు చెక్కుల రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు చెప్పారు.

రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - వీరవాసరం

మొంథా తుపాన్‌కి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం ఆధ్వర్యాన గురువారం మండలంలోని తోకలపూడి, పి.వేమవరం, నౌడూరు, ఉత్తరపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో వరిపంట దెబ్బతిందన్నారు. పంట ఈనిక దశలోనూ, పాలు తోడుకునే దశలోనూ వుండటంతో పడిపోయిన పంట పూర్తిగా దెబ్బతినే పరిస్థితి వుందన్నారు. ప్రభుత్వం పర్సంటేజ్‌తో సంబంధం లేకుండా ఎంత నష్టపోయినా నమోదు చేయాలన్నారు. పంటనష్టం ఎకరాకు ఇరవై ఐదు వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బిన్నీ బాబుతో మాట్లాడుతూ కొణితివాడ, ఉత్తరపాలెం పంట దెబ్బతిన్న పలువురు కౌలురైతులకు కౌలు కార్డులు లేవని, ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇచ్చి కౌలురైతుల పేరున పంటనష్టం నమోదు చేయాలని, పంటల బీమా వర్తింపు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కేతా జ్యోతిబసు, రైతుసంఘం జిల్లా పూర్వ కార్యదర్శి జుత్తుగ నర్సింహమూర్తి, కౌలురైతులు గాజుల నర్సింహం, నాగరాజు శ్రీహరిరాజు, కోడి వెంకట నారాయణ, పాలా వెంకటరమణ, పాలా కోటేశ్వరరావు, గొట్టుముక్కల శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: మండలంలో తుపాను వల్ల నష్టపోయిన రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని జగన్నాథపురం, మాధవరం, దండగర్ర, ఉప్పరగూడెం, ఇటుకులగుంట గ్రామాలలో పర్యటించి రైతులు, కౌలు రైతులు కష్టాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాలుపూరి సత్యనారాయణ, కండెల్లి సోమరాజు మాట్లాడారు. కౌలు రైతులు వల్లూరు వెంకట్రావు, వల్లూరు సతీష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు పీల గాదినాయుడు, కర్రి వీర్రాజు, ఆకులు ఏసు, పీలా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పొలమూరు డ్రెయిన్‌లో అడ్డంకుల తొలగింపు

ప్రజాశక్తి - వీరవాసరం

మొంథా తుపాన్ కారణంగా పొలమూరు డ్రెయిన్‌లో పడిపోయిన చెట్లను గురువారం వీరవాసరం డిసి ఛైర్మన్ ఆకుల లీలాకృష్ణమూర్తి, డ్రెయినేజీ జెఇ వేంద్ర రమణ పర్యవేక్షణలో తొలగింపు చర్యలు చేపట్టారు. నవుడూరు సెంటర్ నుండి డ్రెయిన్ కింది వరకు అడ్డంకిగా పడి ఉన్న చెట్లను, పేరుకుపోయిన చెత్తను జెసిబితో తొలగిస్తున్నట్లు వారు తెలిపారు. రెండు రోజుల పాటు ఈ తొలగింపు పనులు జరుగుతాయన్నారు. నవుడూరు సెంటర్ వద్ద డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న అనేక దుకాణాల చెత్తను డ్రెయిన్‌లో ఇష్టానుసారంగా పడివేయడంతో మురుగునీరు పారుదలకు ఆటంకంగా మారుతుందని గుర్తించారు. ఈ చెత్త వల్ల మురుగుకాలువ పూడుకుపోయి ఎగువ భాగంలోని వరిచేలు ముంపు బారిన పడుతున్నాయన్నారు. మురుగుకాలువలో చెత్త వేస్తూ బాధ్యతారాహిత్యంగా ప్రవరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నవుడూరు పంచాయతీ కార్యదర్శి మాణిక్యం కోరారు. ఈ కార్యక్రమంలో పొలమూరు నీటి సంఘం అధ్యక్షులు గుడాల వెంకటేశ్వరావు, సభ్యులు కోడి నరసింహరావు, గుత్తల నారాయణరావు పాల్గొన్నారు.

అడ్వాన్స్ గ్రో హెయిర్, గ్లో స్కిన్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్య, వైద్య, వాణిజ్య, వ్యాపార రంగంలో భీమవరం పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఇటువంటి భీమవరం పట్టణానికి ఇంటర్నేషనల్ సంస్థలు రావడం అభినందనీయమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం జెపి రోడ్డులో అడ్వాన్స్ గ్రో హెయిర్, గ్లో స్కిన్ క్లినిక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. దుబాయ్, మలేసియా, సింగపూర్, శ్రీలంక, పంజాబ్, గుజరాత్ తదితర ప్రదేశాల్లో ఉన్న అడ్వాన్స్ గ్రో హెయిర్, గ్లో స్కిన్ క్లినిక్ భీమవరం పట్టణంలో 107వ బ్రాంచిను ప్రారంభించుకుందన్నారు. అడ్వాన్స్ గ్రో హెయిర్, గ్లో స్కిన్ క్లినిక్ పౌండర్ సరన్ వేల్ జయరామన్, పార్టనర్ సుదీర్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్, ఎఎంసి వైస్ ఛైర్మన్ బండి రమేష్, యిర్రింకి సూర్యారావు, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో నందిని సత్తా

తణుకు : బాలికల అండర్-19 అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 22, 23 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా పెదవేగిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో తణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన కె.నందిని ద్వితీయ స్థానాన్ని సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిత్తూరు సత్య ఉషారాణి గెలుపొందిన విద్యార్థిని ప్రశంసిస్తూ భవిష్యత్తులో మంచి విజయాలను సాధించాలన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థిని కొండేటి నందినిని అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తి : ఇఇ

నరసాపురం : నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని తొమ్మిది సబ్‌స్టేషన్ పరిధిలో 100 శాతం విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తి చేసినట్లు విద్యుత్ శాఖ నరసాపురం ఇఇ కె.మధుకుమార్ తెలిపారు. తుపాన్ కారణంగా చాలా గ్రామాల్లో విద్యుత్ వైర్లు, కేబుల్, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయన్నారు. స్తంబాలు కింద పడిపోయాన్నారు. వీటిని సరి చేయడంతో పాటు ఆరు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసామన్నారు. కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని 150 మంది సిబ్బందితో పాటు నలుగురు ఎడిఇ, ఎఇలను రప్పించడం జరిగిందన్నారు. వీరు నిరంతరం పనిచేసి విద్యుత్ మరమ్మత్తులు చేపట్టి గ్రామాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామన్నారు.

విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి

తాడేపల్లిగూడెం : విద్యార్థులు కొత్త కొత్త ఆవిష్కరణలపై దృష్టిసారించాలని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. నిట్ విద్యా సంస్థలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్కిల్ స్పార్క్ 1.0 అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించనున్న వర్క్ షాపు గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఫణికృష్ణ కర్రి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం పాటుపడాలని సూచించారు.

'అధికారుల కృషి అభినందనీయం'

పెనుమంట్ర : మొంథా తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా గత ఐదు రోజులుగా టెక్నాలజీతో రియల్ టైం గవర్నెన్స్ ద్వారా అధికారులను, ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయడం ద్వారా పంట నష్టాల తీవ్రత తగ్గించడానికి ప్రభుత్వాధికారులు చేసిన కృషి అభినందనీయమని టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు భూపతిరాజు రాధాదేవి గురువారం ఇక్కడ అన్నారు. ముందస్తుగా ఇతర జిల్లాల నుండి ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారిని, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను రప్పించడంతోపాటు అధికారులను సమన్వయంతో పనిచేసేలా చేసారన్నారు. ప్రతీ జిల్లా, మండలంలోని అధికారులు మూడు రోజుల పాటు ఇళ్లకు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉండి ప్రజలకు అవగాహన కలిగించారన్నారు. ఎక్కడైనా చెట్లు పడిపోయినా, కరెంటు పోల్స్ పడిపోయినా వెంటనే అధికారులు దగ్గరుండి చర్యలు తీసుకోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు లేకుండా తుపాను నుండి బయటపడటం జరిగిందని ఆమె పేర్కొన్నారు.